

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సెల్ ఫోన్స్‌కే నోళ్ళు వస్తే...

"మంచం మీద నుండి కింద పడగానే 'ఠంగ్' అన్న శబ్దం! నా నడుం విరిగిందే అనుకున్నా.. మా యజమానురాలికి ఒళ్ళు పొగరు. ఇది మూడు వందల ఎనభై ఆరోసారి ఇలా నన్ను కింద పారెయడం. ఒళ్ళో పెట్టుకుని కూర్చోవడం.. ఎవరైనా పిలవగానే గబుక్కున నా సంగతి మరచిపోయి లేవడం, పడుకుని నా చెవిలో తన నోరు నెప్పెట్టేదాకా మాట్లాడడం, ఏ పాలో పొంగిపోతున్నాయి అని గుర్తొచ్చి పరిగెత్తడం.. నేను కింద పడి 'కుయ్యో మొర్రో' అంటుంటే, గబగబా నొక్కి నా గుండె కొట్టుకుంటుందో లేదోనని పరీక్షించడం. ఈ జాగ్రత్త కాస్త ముందు ఏడవచ్చుగా.

అసలు ఏం మాట్లాడుతుందో తెలుసా? ఒద్దులెండి.. ఎంతైనా వాళ్ళ 'కరెంట్' తింటున్నా.. విశ్వాసం ఉండాలి. అన్నీ చెపితే ఏడుస్తుంది. అప్పటికీ 'బిల్' చూసినప్పుడల్లా వాళ్ళ ఆయన కాస్త పొదుపుగా వాడమని చెపుతూనే ఉంటాడు. అయినా ఈ మధ్య మా సెల్‌ఫోన్ల అసోసియేషన్ ఒకటి స్థాపించి మేమంతా మీటింగ్ పెట్టుకున్నాం. అందులో తేలిందేంటంటే.. మగవాళ్ళు సెల్ వాడకం కన్నా ఆడవాళ్ళు సెల్ ఫోన్ వాడకం ఎక్కువ అని! వీళ్ళు పొద్దుగూకులూ మా చేత యమా చాకిరీ చేయిస్తారు. "మీనాక్షీ! పనిమనిషి వచ్చిందా?" "ఒసే అంజమ్మా.. ఇంకా పనికి రాలేదేం? ఎవరింట్లో ఉన్నావ్? సుశీల గారింట్లో ఉన్నావా? అయితే కరివేపాకు కాస్త కోసుకురా! ఓ సారి సుశీల కివ్వు. సుశీలా మొన్న చైతన్య పెళ్ళిలో నువ్వు కట్టుకున్న చీర చాలా బావుంది. ఉప్పాడా?"

"ఉప్పాడే అది చూసి మా ఆడబడుచు కుళ్ళుకుంది. వాళ్ళకి ఉప్పాడలో కొనలేదని. మా అత్తగారు కూడా సూటీపోటి మాటలన్నారు."

"వీళ్ళ గొడవ ఎప్పుడూ ఉండేదేలే. అందుకే కమలమ్మ గారి కోడలు వేరు కాపురం పెట్టింది."

"వాళ్ళకి నాగ్‌పూర్ ట్రాన్స్‌ఫర్ అయింది అనుకుంటానూ. అక్కడ సంత్రాలు బావుంటాయి."

"మా పెద్దమ్మా వాళ్ళూ మా చిన్నప్పుడు నాగ్‌పూర్‌లోనే ఉండేవారు. ఓ సారి ఏం జరిగిందనుకున్నావ్ రైల్లో వెళుతుంటే దొంగాడు మా పెద్దమ్మ గొలుసు కాజేసాడు..

"మా ఇంటి దగ్గర రెండో లైన్లో ఉండే లలితగారికి కూడా ఇలాగే జరిగింది. మొన్న ఢిల్లీ వెళుతుంటే.."

"ఢిల్లీలో చలి ఎక్కువగా ఉందటగా. మా తోడికోడలి తమ్ముడి పెద్ద కూతురు అక్కడే ఉంటుందిలే చెప్పింది"

"రెండోది యు.యస్.లో ఉంటుంది అన్నావుగా?"

"అవును కాలిఫోర్నియాలో ఉంటుంది"

"సంబంధాలు చూస్తున్నారా? మా తమ్ముడు ఇప్పుడు L.A లో పనిచేస్తున్నాడు."

"అయితే ఓ సారి ఫోటో జాతకాలు పంపు. ఏం పెళ్ళిళ్ళో, బంగారం ధరలు పెరిగిపోతున్నాయి.."

ఇంతలో అంజమ్మ "అమ్మా నా సెల్‌ఫోన్ ఇస్తే నేను పోవాలి.. మీలాగా ముచ్చట్లు చెప్పుకోనీకి నా తాన టైం లేదు!" అని సుశీల చేతిలోంచి గుంజుకోబట్టిగానీ, లేకపోతే ఇక్కడ నా చెవీ, అక్కడ అంజమ్మ సెల్ చెవీ వాచిపోయేది! ఎక్కడ మొదలు పెట్టి ఎక్కడకి వెళ్ళారో చూసారా? పక్కింట్లో ఉన్న పనిమనిషితో మెదలుపెట్టి నాగ్‌పూర్, ఢిల్లీ, అమెరికా దాకా వెళ్ళిపోయారు. పనివేళ.. ఇది వీళ్ళకి అవసరమా?

అవతల సుశీల మొగుడు మాడిపోయిన చపాతీలు డబ్బాలో పెట్టుకుని, కూర ఉడకక కాస్త చక్కెర అందులో వేసుకుని ఆఫీసుకి వెళ్ళాల్సొచ్చింది.

ఇవతల మా మేడం ఇవ్వాల్సిన స్క్రిప్ట్ టైంకి ఇవ్వకపోగా 'అబ్బా! పనితో చచ్చిపోతున్నాను.. రాయడానికి తీరికలేదు." అని అబద్ధాలు చెపుతుంటుంది. అసలు ఈ అబద్ధాలతో చచ్చిపోతున్నాను.

మా మేడంతో రకరకాల చోట్లకి వెళుతుంటాను. ఇటు సినిమా వాళ్ళు, అటు రాజకీయవేత్తలు, వ్యాపారస్తులు, డాక్టర్లు, టీచర్లు.. అందర్నీ కలుస్తుంటాను.

ఓసారి ఓ రాజకీయనాయకుడి సెల్ ఫోను వైపు ఈర్ష్యగా చూసాను. ఎందుకంటే అది సరికొత్త మోడల్‌ది. ఇంకా ఈ దేశంలో రాలేదు. బోలెడన్నీ ఫీచర్స్ ఉన్నాయి.

"ఏంటి నా వైపు అలా చూస్తున్నావు?" అంది.

"నేను నీలా ఎందుకు లేనని?" అన్నాను. మాకు మనుషుల్లా బయటో మాటా, లోపలో మాటా ఉండవు.

అది పకపకా నవ్వి "రోజూ నువ్వు నాలాగా ఆయిల్ మసాజ్, కడుపు నెప్పికీ, గుండె మంటకీ మందులు వేసుకుంటావా?" అని అడిగింది.

"ఎందుకూ?" అడిగాను.

"అయ్యో.. నా బాధలు ఏం చెప్పమంటావ్? ఈయనకి ఇప్పుడు ఫోన్ వస్తుంది.. విను. ఏం మాట్లాడ్తాడో? అంది. నిజంగానే సెల్ మోగింది. పి.ఏ వచ్చి, కొద్దిగా ఒంగి, నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని రహస్యంగా "గోవర్ధనంగారు లైన్లో ఉన్నారు." అన్నాడు.

"పార్టీ మారాడా?" ఈయనా రహస్యంగా అడిగాడు.

"మీరు 'ఊ" అంటే వచ్చేసేటట్లున్నాడు సార్!" పి.ఏ. చెప్పాడు.

అప్పుడు ఈయన సెల్‌లో "సార్ సార్ సార్. నేనే చేద్దాం అనుకున్నాను. మీరే చేసారు. ఎంతకాలం అయింది సార్ మీ గొంతు విని.. పాతమిత్రులతో మాట్లాడుతుంటే, ప్రాణం లేచినట్లవుతుంది.. సార్.. మీరేం మాట్లాడకండి. మా ఆవిడ అన్నయ్యగారు రాలేదేమిటి అని అడుగుతోంది... ప్రొద్దుటే బ్రేక్ ఫాస్ట్‌కి వచ్చెయ్యండి. అన్నీ అప్పుడే మాట్లాడుకుందాం.. మనం రామలక్ష్మణుల్లాంటి వాళ్ళం. విడిపోకూడదా.. రేపు ఏడున్నరకి ఇంటికొచ్చెయ్యండి చెపుతా." అని సెల్ పెట్టేసి, పి.ఏ.తో, "ఈ ముసలి గుంటనక్క మీద ఓ కన్నేసి ఉంచు. బామ్మర్దికి సీటు అంటున్నాడు. ముందు పార్టీ మారేటట్లు చెయ్యి తర్వాత ఆ బామ్మర్ది బతికి బావుంటే.... తర్వాత ఆలోచిద్దాం.." అన్నాడు.

నేను తెల్లబోయాను.

"విన్నావా? ఎంత రొచ్చూ బురదా ఉంటుందో? నువ్వు కరివేపాకు గురించీ, కథల గురించీ వింటూ ఎంటర్‌టైన్ అవుతున్నావ్. ఇక్కడ నేను పరమ భయంకరమైన మారణకాండలు వింటూ. కేన్సర్ వచ్చినట్లు కృశించిపోతున్నాను." అంది కన్నీళ్ళతో. నాకు కాస్త జ్ఞానోదయం అయింది. తర్వాత ఒక సినిమా నిర్మాత ఆఫీసుకి వెళ్ళాం.. అక్కడ ఆయన సెల్ ఫోన్‌లో ఎవరితోటో "మీరు మా బ్యానర్‌లో ఇన్నేళ్ళనుంచీ పని చేస్తున్న రచయిత! మిమ్మల్ని గాక ఇంకెవర్ని పెట్టుకుంటాం అండి. ఆ ఆగిపోయిన సినిమా ఇంకా ఏం ఆలోచించలేదండీ.. టచ్‌లో ఉండండి.. చెపుతా! నమస్కారం.." అని ఫోన్ పెట్టేసి "మనం ఆగిపోయిన సినిమా ప్లాన్ చేస్తున్నాం అని అప్పుడే వెబ్ సైట్లో పెట్టారా? ఈ రచయిత నెంబర్ బార్ చెయ్యండి. నా ప్రాణాలు తినేస్తున్నాడు!" అన్నాడు.

ఆ సెల్‌ఫోన్ పక్కకి వచ్చి గాలి పీల్చుకుంటూ "అబద్ధాలు వినలేక ఊపిరి ఆగిపోతోంది. నన్ను జపాన్ నుండి తెచ్చాడు. ఒక్క నిజం చెప్పడు. నాకు అవతల వాళ్ళకి ఆశలు పెట్టి తిప్పుతుంటే, కడుపు ఉడికిపోయి 'మీరు టైం వేస్టు చేసుకోండి. ఆశలు పెడతాడే కానీ నిజంగా హెల్ప్ చెయ్యడు. అని చెప్పేద్దాం అనిపిస్తుంది. కానీ మనకి చెవే కానీ నోరు లేదుగా ఏం చేస్తాం!" అని బాధపడింది.

నేను 'అవును నిజమే!' అనుకున్నాను.

మేడంతో ఓ షూటింగ్ కి వెళ్ళాను. నన్ను లొకేషన్లో వాడదు. కార్లోనే ఉంచుతుంది! ఓ అమ్మాయి నా పక్క కొచ్చి మాట్లాడ్తోంది.

"అవినాష్.. అన్నపూర్ణాలో ఉన్నాను. రాత్రి ఫోన్ చెయ్యలేదేం? రాత్రంతా నా ఫోన్ కోసం ట్రై చేసావా? అయ్యో ఈ సెల్ బ్యాటరీ అయిపోయి ఆగిపోయింది. అనుకుంట! వెధవ సెల్!

లొకేషన్ దూరంగా ఇంటికొచ్చేటప్పటికీ తెల్లారిపోయింది. ఈ రోజు ఇంటికి రా.. నేను అడిగిన పదివేలూ ఎరేంజ్ చేసావా? రాణీ పెళ్ళికి డిజైనర్ శారీ కొనుక్కోవాలి. మీ బాస్‌ని ఎడ్వాన్స్ అడుగు! తప్పకుండా తీసుకురా.. బై! ప్చ్.. ప్చ్!"

ఆ సెల్‌ని నిర్లక్ష్యంగా తాడు కట్టి మెడకి వేసుకుంది. అది ఊగుతూ నాతో "నన్ను అవినాష్ గాడు కొనిచ్చాడు. ఇది వేసుకున్న డ్రెస్ వాడే కొనిచ్చాడు. ఈ పెర్ ఫ్యూమ్ వాడు కొనిచ్చిందే ఇది ఉండే ఫ్లాట్ ఇది ఉండే, ఫ్లాట్ కూడా వాడే కొనిచ్చాడు. ఇది రాత్రి ఇక్కడ ఎవడితోటో ఉండిపోయి. తప్పు నా మీద వేసి నన్ను వెధవ సెల్ అని తిడుతోంది" అంది.

నేను జాలిగా చూసాను.

ఇంతలో మళ్ళీ ఆ అమ్మాయి సెల్ మోగింది. "హాయ్ ప్రేమ్? రాత్రికా? చూస్తా.. ఊరు నుండి అమ్మ వచ్చింది. ఆవిడ్ని ఆస్పత్రికి తీసుకెళ్ళాలి. రేపు కలుద్దామా?" అంటోంది.

ఇంకా జాలిగా చూసాను.

మళ్ళీ మా భాష వినిపించింది.

"ఒరేయ్. సెంట్రల్ దగ్గరకి వచ్చెయ్! శ్రీరామ నవమి కదా.. గుళ్ళో కళ్యాణమంట.. కలెక్షన్ బావుంటుంది! ఆ మూడో మెట్టు శామ్యుల్ గాడిది. మొదటి మెట్టు మీద నేనూ లచ్చుగాడూ అడుక్కుంటాం" అని, అంది ముష్టి సెల్!

"నీ లెవెల్ నా కన్నా చాలా తక్కువ! నీ అంతస్తెక్కడ? నా అంతస్తు ఎక్కడ?" అన్నట్లు దాని వైపు చూసాను. కానీ షాక్ అది కొత్తగా మెరిసిపోతూ కనిపించింది.

అది నవ్వి "నేనూ ఓ అప్పుడు కోటీశ్వరురాలి దగ్గరుండే దాన్ని! బెంజ్ కారులో ఏ.సీ.లో తిరిగేదాన్ని. కానీ ఓ రోజున మా మేడం గుడికొచ్చి, కొబ్బరి చిప్పకొట్టుకుంటూ నన్ను గుడి అరుగు మీద మరిచిపోయింది. అప్పటినుండీ ఈ కుష్టురోగి రాములు దగ్గర కొచ్చి పడ్డాను! నిజం చెప్పొద్దూ.

మా మేడం ఎప్పుడూ ఒక చోట ఉండి ఇంకో చోట ఉన్నా అనీ. డబ్బులు పర్సు నిండా ఉంచుకుని, పనివాళ్ళు అడిగితే లేవనీ, ఇలా అబద్ధాలు చెపుతుంటే, నాకు గుండె నొప్పిగా, నీరసంగా, అజీర్తిగా ఉండేది! కానీ ఈ రాములు నన్ను అట్టే ఇబ్బంది పెట్టడు.

అవసరామైతేనే వాడతాడు. ఏ రైల్వే స్టేషనులోనో అప్పుడప్పుడూ నాకు ఫుడ్ పెట్టించి మితంగా వాడతాడు. నా ద్వారా అబద్ధాలు చెప్పడు. ఉన్నది ఉన్నట్లే చెపుతుంటాడు. నాకు ఇక్కడే బావుంది.. ఏ.సీలు బంగ్లాలు అక్కర్లేదు. పేవ్ మెంట్ మీద పడుకున్నా ఏ అర్ధరాత్రి ఏ వార్త వినాల్సి వస్తుందో, ఎవరి కొంప ముంచాల్సి వస్తుందో అన్న భయం లేదు. నిశ్చింతగా ఉంది." అని హాయిగా నవ్వింది.

టాటా చెపుతూ అడుక్కోడానికి రాములుతో వెళ్ళిపోయింది.

పక్కనుండి ఎవరో "కొట్టండి, నరకండి, సంపు బిడ్డా.. సంపు." అని అరుస్తున్నారు. ఏంటీ? ఏదైనా రక్తచరిత్రా? అని పక్కకి చూస్తే అది రింగ్ టోన్! నాకు. దగ్గరగా వెకిలిగా నవ్వుతున్న సెల్.

"వీళ్ళ రింగ్‌టోన్ లు కావు కానీ జనం తిట్టిపోస్తున్నారు. మొన్నా మధ్య మా ఫ్రెండ్ ఒకడి రింగ్‌టోన్ విని అంతా తిట్టడమే. ఫోన్ తియ్యగానే ఓ అమ్మాయి గొంతు "ష్.. ఎందుకు చేసావు? మా నాన్నగారింకా ఇంట్లోనే ఉన్నారు పెట్టేయ్" అంటోందట! అది రింగ్ టోన్ అని తెలియక కొంత మంది పెట్టేస్తే, ఇంకా కొంతమంది అపార్థాలు చేసుకుని, తిట్టిపోసారుట!

ఒక్కోసారి చావింట్లో, శవం దగ్గర, పోయిన వారి కుటుంబం శోకంలో ఉంటే సడెన్‌గా పగలబడి నవ్వుతున్న ధ్వనీ, లేదా "పిల్లా నీ బావ నిస్తావా?" అని వినపడి, ఏడుస్తున్న వాళ్ళంతా మనని అపరాధుల్లా చూడడం.. అవసరమా?" అంది.

అంతెందుకు మా మేడం డ్రైవర్‌కి ఫోన్ చేస్తే "ఏం పిల్లో ఎల్దాం వస్తావా?" అని వినిపిస్తుంది! వాడికి గడ్డి పెట్టి ఆ రింగ్‌టోన్ ఏవిట్రా? అని మేడం తిడితే.. "నాకేం ఎరిక? ఏం నొక్కి నానో గానీ అది పోతలేదు మేడం! ముప్పై రూపాయలు కట్ అవుతున్నాయ్" అని తల గోక్కుంటాడు.

ఇవన్నీ పక్కన పెట్టేస్తే.. మాకు ఉన్న తిట్లు చాలవన్నట్లు కాల్ సెంటర్లు వాళ్ళు ప్రాణాలు తీసేస్తున్నారు.

మధ్యాహ్నం మా మేడం నిద్రపోతుంటే వాళ్ళు ఫోన్ చేస్తారు. తీస్తే తిడుతుంది. అని నేను నెమ్మదిగా మోగినా, తీస్తుంది. "మేడం మేం ఫలానా సెల్ కంపెనీ నుండి చేస్తున్నాం." అనగానే తిడుతుంది.

ఇంక టూవీలర్స్ మీద వెళ్ళే వాళ్ళు అయితే సెల్ రింగ్ అవుతుంటే పాపం, కష్టపడి రోడ్డు పక్కన ట్రాఫిక్‌లో పక్కకి తీసి, ఆపి, చెమట్లు కక్కుతూ ఏదైనా అర్జెంటు కాలేమో. అని చూస్తే " ఏ ప్లస్.. బీ ప్లస్..అంటూ కఠోరంగా వినిపించడమే కాకుండా" ఈ పాట కావాలనుకుంటే ఒకటిని ప్రెస్ చెయ్యండి. లేదా.. మరలా వినాలనుకుంటే రెండుని.. "అని చెపుతుంటే, ఎండలో తల మాడిపోతున్నవాడు ట్రాఫిక్ జాంలో అవసరమా అని మమ్మల్ని ఓ బూతు తిట్టి, (జంధ్యాలగారి హాయ్ హాయ్ నాయికాలో పిల్లాడు మాట్లాడగానే 'ఓ కర్ణ కఠోరమైన బూతు' అని తెర మీద వస్తుంది! అలాగే.. సెన్సార్ కట్ ఇక్కడ కూడా!) మళ్ళీ ట్రాఫిక్‌లో బండి తీసేటప్పటికి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటాడు.

మా మేడం చెప్పే కథలు విని విని నాకు కూడా కథలూ, కబుర్లూ చెప్పడం వచ్చేస్తోంది.

'అయ్యో! వర్షం పడుతోంది.. ఇప్పుడు మాట్లాడ్డం ఆపచ్చుకదా! నీళ్ళు పడితే నా ఆరోగ్యం పాడయి మొన్నటికి మొన్న పన్నెండు వందలు వదిలాయి. అయినా బుద్ధిరాలేదు!. అవును అన్నట్లు మా చెల్లెలు ల్యాప్‌టాప్ చెప్పింది "కొడుకు ఏపిల్ ఐ ఫోన్ తెస్తా అన్నాడట అమెరికానుండి. అప్పడి నుండీ నా మీద శ్రద్ధ పెట్టడం లేదు! మొదట్లో ఓ స్నేహితుడు ప్రెజెంట్ చేసాడని ఎంత ప్రేమగా చూసేదో? ఏం చేద్దాం... మనుషులంతా ఇంతే! రోబో సినిమాలో రజనీకాంత్ యంత్రుడి గురించి చెప్పినట్లు 'అతను ఆలోచించడం మొదలు పెట్టాడు' అందుకే అతన్ని మానవుడు నాశనం చేసాడు

మేం నోళ్ళు మూసుకుని ఉంటేనే ఈ సమాజంలో పెద్ద మనుషులు హాయిగా ఉంటారు. మేం గుట్టు విప్పామా మా ఎస్.ఎమ్.ఎస్ లూ.. కాల్ రికార్డింగులూ వింటే, ప్రభుత్వాలూ, కాపురాలూ కూలిపోతాయి. స్నేహాలూ, చుట్టరికాలూ నాశనం అవుతాయి!

మా సినిమాలో ఆలీ అన్నట్లు మేం నోళ్ళు విప్పితే అందరి పనీ "శుభం భూయాత్! జాం బరాబర్.. జంతర్ మంతర్.. జాలు బో త్రీ కాయ్!"

●●●

**Click here to share your comments on this article**